
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

కృష్ణా
జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024



ఖరీఫ్ ప్రణాళిక సరే..

వైసీపీ పాలనలో సాగునీటి కాలువల నిర్వహణ లేదు. డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టలేదు. కాలువల్లో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్కను తొలగించనూ లేదు. ఎప్పుడు తొలగిస్తారో తెలీదు. వీటిని తొలగించకుండా సాగునీటిని ఎలా సరఫరా చేస్తారో స్పష్టత లేదు. నాలుగేళ్లుగా అరాకొరగా ఎరువులు తెప్పించి తీవ్ర కొరత సృష్టించి రైతులను ప్రైవేటు వ్యాపారుల కబంధహస్తాల్లోకి నెట్టేసింది. ఇన్ని ప్రతికూలతలున్నా వాటిని సవరించుకోకుండా ఎప్పటిలానే జిల్లా ఖరీఫ్ ప్రణాళికను అధికారులు సిద్ధం చేయడం గమనార్హం.

సమస్యలు పరిష్కరించకుండా సాగు ఎలా?

మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి : జిల్లాలో 2024 సంవత్సరం ఖరీఫ్ ప్రణాళికను వ్యవసాయశాఖ రూపొందించింది. జిల్లాలో 1,72,435 హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు అవుతుందని అంచనా వేసింది. అయితే సాగునీటిని ఎప్పటికి విడుదల చేస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఎన్నికల కౌంటింగ్ పూర్తయితే జూన్ 6వ తేదీనాటితో ఎన్నికల కోడ్ ముగుస్తుంది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే కృష్ణాడెల్టాకు సాగునీటిని విడుదల చేసే అంశంపైనా, కాలువల మరమ్మతులకు నిధులు విడుదల చేసే అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వం గత మూడేళ్లుగా రైతులను ముప్పుతిప్పలు పెట్టింది. కాలువల నిర్వహణ దగ్గర నుంచి నీటి విడుదల, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పంపిణీ, ధాన్యం సేకరణ వరకూ అన్ని సందర్భాల్లోనూ అసంబద్ధ విధానాలతో, అస్పష్ట నిర్ణయాలతో కాలం గడిపింది. చివరకు కొన్న ధాన్యానికి కూడా డబ్బులు చెల్లించకుండా తాత్సారం చేసి రైతులను అప్పుల బారిన పడేసింది.

ఖరీఫ్ ప్రణాళిక ఇదీ..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు 1,65,789 హెక్టార్లలో, చెరకు 4,310 హెక్టార్లలో, వేరుశెనగ 765 హెక్టార్లలో, మినుము 1,135 హెక్టార్లలో, మొక్కజొన్న 112 హెక్టార్లలో, పత్తి 300 హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. జిల్లాలో మొత్తంగా 1,72,435 హెక్టార్లలో వివిధ పంటలు సాగు జరుగుతుందని ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయశాఖ ద్వారా నివేదిక పంపింది. ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, బీపీటీ 5204 రకం వరి వంగడాలకు సంబంధించి 6,691 కింటాళ్ల విత్తనాలను క్వింటాలు రూ.500 చొప్పున సబ్సిడీపై ఇవ్వాలని నిర్ణయించింది. వరి విత్తనాలు ఆయా వంగడాలను బట్టి క్వింటాలు ధరను రూ.3250 నుంచి రూ.3800గా నిర్ణయించింది. భూసారాన్ని పెంచే జీలుగ విత్తనాలు 2864 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 579 క్వింటాళ్లు, పిల్లిపెసర 966 క్వింటాళ్లు 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేయాలని నిర్ణయించింది. జీలుగ విత్తనాలు క్వింటాలుధర రూ..8800 ఉండగా రూ.4400కు, పిల్లిపెసర విత్తనాలు క్వింటాలు రూ.13400 ఉండగా రూ.6700కు, జనుము విత్తనాలు క్వింటాలు రూ.8800 ఉండగా 4400కు అందజేయాలని నిర్ణయించింది. వ్యవసాయ అనుబంధశాఖల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సూచనలు చేయాలని నిర్ణయించింది.

కాల్వల నిర్వహణ శూన్యం

- డ్రెయిన్ల మరమ్మతులు లేవు
- గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించనూ లేదు
- ఎప్పుడు తొలగిస్తారో స్పష్టత లేదు
- సాగునీటి విడుదల ఎప్పుడో తెలీదు
- అయినా ఘనంగా విత్తన ప్రణాళిక
- జిల్లాలో 1,72,435 హెక్టార్లలో పంటల సాగు అంచనా

● కలెక్టర్ సమీక్ష

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రణాళిక అమలుపై కలెక్టర్ సోమవారం వ్యవసాయశాఖ అధికారులతో తన ఛాంబరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, డ్రిప్ ఇరిగేషన్, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భూమి స్వభావం, ఆయా ప్రాంతాల్లో సాగుకు అనుకూలంగా ఉండే వంగడాలు, రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే ప్రోత్సాహకాలు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యాక ప్రతి 15 రోజులకోసారి వ్యవసాయ అనుబంధ శాఖలపై తాను సమీక్ష చేస్తానని ఈలోగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులను ఆదేశించారు.

ఎరువులు అందుబాటులో ఉంచుతారా?

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే పంటలకు 88,601 టన్నుల ఎరువులను రైతులు వినియోగిస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఎరువుల ధరలను అధికంగా విక్రయించినా వ్యవసాయ అధికారులు ఎవ్వరూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో 13,472 టన్నుల ఎరువులు జిల్లాకు రాగా, మరో 34,326 టన్నుల ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్టు అధికారులు చూపారు. గత నాలుగు సంవత్సరాలుగా రైతులు విరివిగా ఎరువులు వాడే సమయానికి కొరత రావడం ఆనవాయితీగా మారింది. జిల్లాలోని ఆర్బీకేలలో 20 టన్నుల ఎరువులను సీజన్ ప్రారంభం నాటికి అందుబాటులో ఉంచాలని నిర్ణయించినా, ఎరువులు పక్కదారి పడతాయని, ధరలు పెరుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికి చివరి కోటాగా వినియోగించే పొటాష్ ఎరువును రైతులకు అందుబాటులో ఉంచకుండా నాలుగేళ్లుగా ప్రభుత్వం తాత్సారం చేసింది. పొటాష్ ఎరువును బ్లాక్ మార్కెట్‌లో అధికధరకు రైతులు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

విత్తనాల కొనుగోలు సమయంలో బిల్లులు తీసుకోవాలి

వరి, ఇతర విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ ఎన్.పద్మావతి రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాల్లో మొలక శాతం పరిశీలించిన తరువాతనే వినియోగించాలని ఆమె తెలిపారు. ఆర్బీకేలలో, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎరువులు కొనుగోలు చేస్తే బిల్లులు తీసుకోవాలని ఆమె సూచించారు.



వివాదాల వర్సిటీ

కారు అద్దె నెలకు రూ.59,999

- 50 నెలలుగా ఒకే ఏజెన్సీకి కారు అద్దె కాంట్రాక్టు
- పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినా గ్రేడ్‌కార్డులు ఇవ్వని వైనం
- ఫీజులు చెల్లించాకే మార్కుల జాబితాలు ఇస్తారట
- నూతన భవనాలకు మరమ్మతుల పేరుతో రూ.3 కోట్ల బిల్లులు

కృష్ణా యూనివర్సిటీ వివాదాల వర్సిటీగా మారింది. పరిపాలనా అంశాల్లో తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన నగదును ఇష్టానుసారంగా ఖర్చు చేస్తుండటంతో ఉద్యోగులు, అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. యూనివర్సిటీ అధికారుల తీరుపై ఉన్నతవిద్యాశాఖ మండలికి ఫిర్యాదులు చేస్తున్నారు. విద్యార్థులకు మార్కుల జాబితాలు ఇచ్చేందుకు నిబంధనలు అమలుచేస్తున్న యూనివర్సిటీ అధికారులు నిధులను వినియోగించడంలో నిబంధనలు ఎందుకు పాటించడం లేదని వివాదం రేగుతోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వీసీ, రిజిస్ట్రార్‌ల కోసం యూనివర్సిటీ తరఫున కార్లు ఉన్నా వాటిని పక్కనపెట్టేశారు. 50 నెలలుగా అద్దెకార్లను తీసుకుని నెలకు రూ.59,999 చొప్పున చెల్లిస్తున్నారు. టెండర్లు పిలవకుండా దొడ్డిదారిన గుట్టుచప్పుడు కాకుండా కార్ల కాంట్రాక్టును గత 50 నెలలుగా ఒకే ఏజెన్సీకి కట్టబెట్టారు. దీనిపై సహచట్టం ద్వారా ఇటీవల కొందరు ప్రొఫెసర్లు వివరాలు కోరారు. ఉన్నత విద్యామండలి అధికారులకు సైతం ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు లేవు. ఇదే కారు వేరే జిల్లాలో గతంలో ప్రమాదానికి గురైందని, మరమ్మతుల కోసం రూ.2.40 లక్షల మేర బిల్లులు చేసిన అంశం వెలుగులోకి వచ్చింది.

పూర్తిస్థాయిలో ఫీజులు కట్టినట్లుగా చూపితేనే సర్టిఫికెట్లు

యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ విద్యార్థులకు ఒకటి నుంచి మూడు సెమిస్టర్‌లకు సంబంధించిన గ్రేడ్ కార్డులు ఇవ్వకుండా ఏడాదిన్నర కాలంగా తొక్కిపెట్టేశారు. విద్యార్థులు మార్కుల జాబితాలు కావాలని కోరితే పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించినట్లుగా నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకువస్తే గ్రేడ్ కార్డులు ఇస్తామని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు.

నూతన భవనాలకు రూ.3కోట్లతో మరమ్మతులట

యూనివర్సిటీ నూతన భవనాలను రూ.87 కోట్లతో నిర్మించారు. నాలుగేళ్ల వ్యవధిలోనే నూతన భవనాలకు రూ.3 కోట్లతో మరమ్మతులు చేసినట్లుగా చూపి బిల్లులు చేసిన అంశంపై కొందరు ప్రొఫెసర్లు, ఉద్యోగులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీకి సంబంధించి తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం గతంలో రూ.50 లక్షలను ఖర్చు చేశారు. ఈ నగదును ప్రభుత్వం నుంచి తీసుకోకుండా విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన నగదు నుంచి మళ్లించారు. అధికార పార్టీ నాయకుడి అనుయాయుడికి ఈ కాంట్రాక్టును కట్టబెట్టడంపైనా అధ్యాపకులు ఇటీవల గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కృష్ణా యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఇతర సిబ్బంది 78 మంది ఇటీవల మాజీమంత్రి కొల్లు రవీంద్రను ఆయన నివాసం వద్ద కలిసి అవకతవకలను వివరించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత యూనివర్సిటీకి వచ్చి అక్కడి పరిస్థితులను గమనించి తదుపరి చర్యలు తీసుకుంటామని కొల్లు రవీంద్ర ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

ఆక్వా రైతులకు శాపంగా..

బంకుల్లో డీజిల్ లూజు అమ్మకాల నిలిపివేత

గొడవలు లేని ప్రాంతాల్లో డీజిల్‌పై ఆంక్షలేంటని రైతుల ఆవేదన

- 6లో..



అక్రమ రవాణా మొదలు

ఇసుకను తరలించేస్తున్న దళారులు

- చెక్‌పోస్టులు లేకపోవడంతో కార్యకలాపాలు
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు
- తవ్విన ఇసుకంతా తెలంగాణకే

కొద్దిరోజుల క్రితం వరకు ఆగిన ఇసుక అక్రమ రవాణా ఇప్పుడు మళ్లీ ఊపందుకుంది. ఇసుక ద్వారా కాసులు వెనుకేసుకోవడానికి అలవాటు పడిన అక్రమార్కులు యంత్రాలకు పని చెప్పకుండా ఉండలేకపోతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారపార్టీ నేతలు కృష్ణా నదిని కొల్లగొట్టేశారు. ఒకపక్క కొండలను కరిగించేశారు. మరోపక్క మట్టిని మాయం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఆపేయాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశించినా అక్రమార్కులకు లెక్కలేకుండాపోయింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఇసుక విధానాన్ని తీసుకొచ్చి గుంపగుత్తగా రీచ్‌లను మొత్తం జేపీ కంపెనీకి కట్టబెట్టింది. దీని ముసుగులో స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు ఇసుక దొంగల అవతారం ఎత్తారు. పార్టీ అధికారంలో ఉండడంతో అనుమతులతో సంబంధం లేదన్నట్టు వ్యవహరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో ఉన్నచోట విచ్చలవిడిగా తవ్వకాలు చేశారు. ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చినా ఈ తవ్వకాలు కొనసాగించారు. కొద్దిరోజుల క్రితం వరకు తవ్వకాలను ఆపి, టిప్పర్లను పక్కనపెట్టిన దళారులు ఇప్పుడు కార్యకలాపాలు ప్రారంభించారు. పోలీసులు ఒకపక్క కేసులు నమోదు చేస్తున్నా లెక్కలేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

'చెక్' లేకపోవడంతో...

ఎన్టీఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలు, కంచికచర్ల, జగ్గయ్యపేట మండలాల పరిధిలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ తవ్విన ఇసుకను సరఫరా చేయడానికి డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉన్న నేపథ్యంలో చాటుమాటుగా తవ్వకాలు చేస్తున్నారు. డంపింగ్ యార్డుల నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా సరిహద్దులు దాటిస్తున్నారు. కొద్దిరోజుల ఈ ప్రక్రియ కాస్తంత వేగంగా నడుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లా సరిహద్దులతోపాటు ప్రవేశమార్గాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద జిల్లాలోకి ప్రవేశించే వాహనాలతోపాటు వెళ్లే వాహనాలను తనిఖీ చేసేవారు. ఇక్కడ కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు, ఎస్ఈబీ పోలీసులు విధుల్లో ఉండేవారు. దీంతో చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేస్తే దొరికిపోతామన్న భయంతో ఇసుకను రేవు దాటనివ్వలేదు. పోలింగ్ ముగియడంతో చెక్‌పోస్టులను తొలగించారు. దీన్ని ఇసుకాసురులు ఒక ఆయుధంగా మార్చుకున్నారు. గ్రామాల్లో నిద్దరపోతున్న వేళల్లో టిప్పర్లలోకి ఇసుకును లోడింగ్ చేస్తున్నారు. ఆ వాహనాలను తెలంగాణ సరిహద్దుల్లోకి పంపేస్తున్నారు. డంపింగ్ యార్డు నుంచి కదిలిన ప్రతి టిప్పర్ తెలంగాణ వైపు చూస్తోంది. ఆయా మార్గాల్లో పోలీసులు సోదాలు నిర్వహించినప్పుడు కొన్ని లారీలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. అయినా ఇసుకాసురులు ఈ కేసులకు భయపడే పరిస్థితి కనిపించడం లేదు. ఒక లారీని పోలీసులు సీజ్‌చేస్తే మరో లారీతో రవాణా మొదలుపెడుతున్నారు.

అక్కడికే ఎందుకంటే...

జిల్లా నుంచి అక్రమ రవాణా చేస్తున్న ఇసుక మొత్తం తెలంగాణ వైపునకు వెళ్లడం వెనుక బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఆదాయం దండిగా వస్తుండడంతోపాటు నిర్మాణరంగం అక్కడ మంచి ఊపు మీద ఉండడంతోనే తెలంగాణకు ఇసుకును పంపేస్తున్నారని తెలుస్తోంది. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్, నల్లగొండ ప్రాంతాల్లో నిర్మాణరంగం జోరుగా ఉంది. ఈ కారణంగానే జిల్లాలోని ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా అక్కడికి పంపేస్తున్నారు. ఒక టన్ను ఇసుకకు జిల్లాలో వచ్చిన ధర కంటే తెలంగాణలో అధికంగా వస్తుండడంతో ఈ ఆదాయంపై ఇసుకాసురులు బతికేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

అర్ధరాత్రి.. మళ్లీ తవ్వకాలు

కొండపావులూరులో జూలు విదిల్చిన వైసీపీ మైనింగ్ మాఫియా


కొండపావులూరులో కొనసాగుతున్న మైనింగ్

- సర్వే నెంబర్ 6, 34లలో అర్ధరాత్రి వేళ అక్రమ తవ్వకాలు
- సమీప మామిడి తోటల్లో ఎక్స్‌కవేటర్లు దాచి తవ్వకాలు
- అధికారం ఉంటుందో లేదో తెలియక చకచకా పనులు
- ఫిర్యాదులను పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

ఎన్నికల ఫలితాలు రావటానికి మరో పక్షం రోజులు ఉంది. అధికారంలోకి వచ్చేది అనుమానంగానే ఉంది. దొరికిన ఈ కొద్ది సమయాన్ని కూడా ఎందుకు వదులుకోవటం అని అధికార పార్టీ నేతలు అక్రమ మైనింగ్‌పై తెగబడ్డారు. గన్నవరం మండలంలోని కొండపావులూరులో ఆగిపోయిన అక్రమ మైనింగ్ మళ్లీ మొదలుపెట్టారు. నిశిరాత్రిలో అక్రమ తవ్వకాలకు తెరలేపారు. వందల సంఖ్యలో లారీలు మట్టిని తరలించేస్తున్నారు. వారం రోజులుగా కొండపావులూరు ఇదే జరుగుతోంది. స్థానికులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు కిమ్మనటం లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కొండపావులూరులో అక్రమ మైనింగ్ మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్టుగా సాగిపోతోంది. కొండపావులూరులోని సర్వే నెంబర్ 6, సర్వే నెంబర్ 34లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. సర్వే నెంబర్ 34లో పూర్తిగా అసైన్డ్ పట్టాభూములు ఉన్నాయి. పూర్వం రోజుల్లో దళితులకు సాగు చేసుకునేందుకు ఇచ్చారు. ఆ తర్వాత క్రమంలో ఈ పట్టాలు చేతులు మారాయి. ఈ భూముల్లో గ్రావెల్, ఎర్రమట్టి నిల్వలు ఉండటంతో అక్రమార్కులు వీటిని మట్టి తవ్వుకునేందుకు కొనుగోలు చేశారు. గతంలో ఒకసారి మట్టి తవ్వకాలకు ఈ భూములను కొనుగోలు చేసి 30 అడుగుల మేర లోతున తవ్వేశారు. ఇటీవల కాలంలో ఇవే భూములను మట్టి కోసం మళ్లీ రెండోసారి కొనుగోలు చేశారు. ఎన్నికల ముందు ఓ 20 అడుగుల మేర అదనంగా అంటే మొత్తంగా 50 అడుగుల మేర తవ్వేశారు. అప్పట్లో ఈ అంశాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీయటంతో.. క్వారీని నిలుపుదల చేశారు. అక్రమ తవ్వకాలు ఆగిపోయాయి.

5 అడుగుల లోతున మళ్లీ తవ్వకాలు

మళ్లీ ఇక్కడ అక్రమ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఈసారి పగటి సమయంలో కాకుండా అర్ధరాత్రి సమయాన్ని తవ్వకాలకు ఎంచుకున్నారు. గత వారం రోజులుగా మరో 5 అడుగుల లోతున అదనంగా మట్టిని, తెల్లచట్టు గ్రావెల్‌ను తవ్వేశారు. ఇంకా తవ్వేస్తున్నారు. కొండపావులూరులోనే సర్వే నెంబర్ 6 కొండను కూడా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం వంటి కేంద్ర సంస్థలు ఉన్నాయి. వీటికి దగ్గర్లోనే సర్వే నెంబర్ 6 ఉంది. సర్వే నెంబర్ 6లో భారీగా తవ్వేస్తున్నారు. సమీప మామిడి తోటల్లో పగటి సమయంలో ప్రొక్లెయిన్లు దాస్తున్నారు. రాత్రి సమయంలో విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. భారీగా గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. వీటికి సమీపంలో జగనన్న కాలనీ ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. స్థానికంగా ప్రశ్నించే వారికి ఇళ్ల బేస్‌మెంట్లలో గ్రావెల్‌ను నింపటానికి తవ్వకాలు జరుగుతున్నాయన్న ప్రచారాన్ని తీసుకు వస్తున్నారు. వాస్తవంగా మాత్రం ఈ గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. సర్వే నెంబర్ 6లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై కూడా ఇప్పటికే ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదులపై రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదు.

బియ్యం దాటించేద్దాం!


ఉమ్మడి కృష్ణాజిల్లాలో అక్రమ బియ్యం భారీ డంప్‌లు ఏర్పాటయ్యాయి. ఎన్నికల వేళ చెక్‌పోస్టుల వల్ల రహస్య స్థావరాల్లో నిల్వ ఉంచిన ఈ డంప్‌ను ఇప్పుడు జిల్లా, దేశ సరిహద్దులు దాటించేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ ఎన్నికల విధుల్లో తలమునకలైన సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు ఇప్పుడు అప్రమత్తం కాకపోతే బియ్యం విదేశాలకు తరలిపోయే ప్రమాదం ఉంది.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అక్రమ బియ్యం నిల్వల భారీ డంప్‌లు

- జిల్లా సరిహద్దు దాటించేందుకు రంగం సిద్ధం చేసిన అక్రమార్కులు
- ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల దగ్గర నిఘాతో బయటకు కదలని నిల్వలు
- చెక్‌పోస్టుల తొలగింపుతో డంప్‌ను తరలించే ప్రయత్నం
- ఇండోనేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి కోసం పోర్టుల్లో వ్యాపారులు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కొనుగోలు చేసిన బియ్యం, ఇంటింటికీ పంపిణీ అయినప్పటికీ వారింటికి వెళ్లి చిరు వ్యాపారులు సేకరించిన బియ్యం నిల్వలు అన్నీ అక్రమార్కుల వద్ద డంప్ అయి ఉన్నాయి. డంప్‌లు రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు అష్టదిగ్బంధనం చేయటంతో తరలించడానికి వీల్లేకుండా పోయింది.

ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడెక్కడంటే..

ఎన్టీఆర్ జిల్లాలో జొన్నలగడ్డ, పెద్దాపురం, గరికపాడు, గంప్రాయి, ముక్త్యాల, వత్సవాయి, మెర్సుమిల్లి, గంగినేనిపాలెం, రాజుపేట (తిరువూరు లైన్), రాజవరం, వేమిరెడ్డిపల్లిలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారా కాస్తుండటంతో బియ్యాన్ని బయటకు కదల్చలేని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కృష్ణాజిల్లాలోనూ నెలకొంది. విజయవాడలోని సింగ్‌నగర్, పాయకాపురం, రాజరాజేశ్వరిపేట, కండ్రిక, భవానీపురం, గొల్లపూడి, రాయనపాడు, కొత్తపేట, చిట్టినగర్, విద్యాధరపురం, పాతబస్తీ, కొండ దిగువ ప్రాంతం, క్రిష్ణలంక, రాణిగారితోట, ఆటోనగర్‌లతో పాటు రూరల్ ప్రాంతాలైన నున్న జక్కంపూడి, పాతపాడు, సూరంపల్లి, ఇబ్రహీంపట్నం కొండపల్లిలలో భారీగా డంప్‌లు ఉన్నాయి. వీటితోపాటు జగ్గయ్యపేట, నందిగామ, జీ కొండూరు, మైలవరం, గంపలగూడెం, తిరువూరు టౌన్, విస్సన్నపేట, రెడ్డి గూడెంలలో భారీ డంప్‌లు ఉన్నాయి.

కృష్ణాజిల్లాలో ఎక్కడెక్కడంటే..

కృష్ణాజిల్లాలో గన్నవరం టౌన్, హనుమాన్ జంక్షన్, కంకిపాడు, ఉప్పలూరు, పెనమలూరు, ఉయ్యూరు. గుడివాడ, పామర్రు, మచిలీపట్నం టౌన్, అవనిగడ్డ, కోడూరు ప్రాంతాల్లో భారీగా డంప్‌లు ఉన్నాయి. గతంలో మాదిరిగా గోడౌన్లలో అయితే ఈ డంప్‌లు చాలా తక్కువగా ఉన్నాయి. ఇళ్లను అద్దెకు తీసుకుని వాటిలో నిల్వ చేశారు.

డీటీలకు తెలిసినా పట్టించుకోరాయె..

డంప్‌లపై స్థానికులు డీటీలకు సమాచారం ఇచ్చినా.. తొక్కిపట్టి ఉంచారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు బియ్యం నిల్వల సమాచారాన్ని డీటీల దగ్గరకు తీసుకు వస్తుంటారు. డీటీలు హడావిడి చేస్తారు. వారి నుంచి డబ్బులు దండిగా తీసుకుని గప్‌చుప్‌గా ఉంటున్నారు. డీటీలలో చాలామంది ఉన్నతాధికారికి చెప్పటం లేదు. ఒకవేళ ఉన్నతాధికారులకు సమాచారం వచ్చిన దాడులకు సిద్ధమౌతుంటే.. డీటీలు అక్రమార్కులకు సమాచారం ఇచ్చేస్తున్నారు. రెండు జిల్లాల కలెక్టర్లు తక్షణం రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది.

దేశాలు దాటించేందుకు రంగం సిద్ధం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సిద్ధం చేసిన బియ్యం డంప్‌లను ముందు జిల్లా సరిహద్దులు దాటించేసి పోర్టులకు తరలించాలన్నది బియ్యం అక్రమ వ్యాపారుల వ్యూహంగా ఉంది. పోర్టుల్లో అక్రమ బియ్యం కొనుగోలు చేసే బడా ట్రేడర్లు ఇప్పటికే తిష్ట వేశారు. అక్రమ బియ్యం వ్యాపారులకు, బడా ట్రేడర్లకు సత్సంబంధాలు ఉన్నాయి. ఒక్క అక్రమ వ్యాపారిని పట్టుకున్నా.. పోర్టుల్లో తిష్ట వేసిన అక్రమ బియ్యం బడా ట్రేడర్ల గుట్టు రట్టు అవుతుంది. ఇండోనేషియా, బంగ్లాదేశ్, శ్రీలంకలకు అక్రమ బియ్యాన్ని తరలించేందుకు కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల్లో కంటెయినర్లతో సిద్ధంగా ఉన్నారు. జిల్లా యంత్రాంగం మరింత చొరవ చూపి ప్రత్యేక ఫోర్సుతో పోర్టుల్లో తనిఖీ చేస్తే భారీగా డంప్ దొరికే అవకాశముంది.



ఆక్వా చెరువులో ఏర్పాటు చేసిన ఏరియేటర్లు, ఇన్‌సెట్‌లో బంకు యజమానులకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు

ఆక్వా రైతులకు శాపంగా..

బంకుల్లో డీజిల్ లూజు అమ్మకాల నిలిపివేత

- ఏరియేటర్లు తిప్పకపోతే పంట నష్టపోతామంటున్న రైతులు
- గొడవలు లేని ప్రాంతాల్లో డీజిల్‌పై ఆంక్షలేంటని ఆవేదన

కృత్తివెన్ను: ఎన్నికల వేడితో రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ పెట్రోల్ బంకుల్లో లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలను నిలిపివేస్తూ అన్ని బంకులకు ఇచ్చిన ఆదేశాలు ఆక్వా రైతుల పాలిటశాపంగా మారాయి. కృత్తివెన్ను ప్రాంతంలో గొడవలు జరగక పోయినా ఈసీ ఆదేశాలను ఉన్నతాధికారులు, పోలీసులు కఠినంగా అమలు చేయడంతో అన్ని బంకుల్లో లూజు విక్రయాలను నిలిపివేశారు. వాహనాల్లో మినహా టిన్నుల్లో, డబ్బాల్లో పెట్రోల్‌తో పాటు, డీజిల్‌ను కొట్టడం ఆపేశారు. వనామీ, చేపల చెరువుల్లో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ అందించేందుకు ఏరియేటర్లను ఏర్పాటు చేస్తారు. కొన్ని చెరువుల్లో కరెంటు మోటర్ల ద్వారా ఏరియేటర్లను నడిపితే మరికొన్ని చెరువుల వద్ద ఆటో ఇంజన్లతో ఏర్పాటు చేశారు. ఆటో ఇంజన్లు డీజిల్‌తో తిరుగుతాయి. కరెంటు మోటార్లు ఉన్న చోట కరెంటు పోయినప్పుడు జనరేటర్ల సాయంతో మోటార్లను తిప్పుతారు. దీంతో ఆక్వా రైతులకు డీజిల్ వాడకం ఎక్కువగా ఉంటుంది. సగటున ఎకరం చెరువు ఉన్న రైతు 20 లీటర్ల డీజిల్ వాడుతుంటాడు. ఈ డీజిల్‌ను టిన్నుల్లో నింపుకొని చెరువుల వద్దకు తీసుకెళ్తారు. తాజాగా ఈసీ ఇచ్చిన ఆదేశాలతో బంకుల్లో లూజుగా డీజిల్ ఇవ్వకపోవటంతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డీజిల్ ఇవ్వకుంటే ఏరియేటర్లు తిరగక ఆక్సిజన్ అందక తమ పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో చేపలు, రొయ్యలకు ప్రతి నిమిషం ఆక్సిజన్ అందించటం తప్పనిసరని, ఏరియేటర్లు ఆగిపోతే వెంటనే పంట మృత్యువాత పడుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల గొడవలు లేని ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు పెద్ద మనసుతో డీజిల్ వరకైనా మినహాయింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

డీజిల్ ఇవ్వకుంటే తీవ్ర నష్టం



ఆక్వాసాగు డీజిల్‌పైనే ఆధారపడి సాగుతుంది. డీజిల్ లూజు విక్రయాలు చేయకుంటే ఆక్వాకు తీవ్ర నష్టం. అధికారులు పునరాలోచన చేసి, ఇక్కడ డీజిల్ విక్రయాలకు అనుమతులివ్వాలి.

-నెక్కంటి భాస్కరరావు, ఆక్వా రైతు

ఆక్వాకు తీరని దెబ్బ



డీజిల్ లూజు విక్రయాలు నిలిపివేస్తే గంటలోనే ఆక్వా పంటకు ఊహించని నష్టం ఏర్పడుతుంది. అధికారులు లూజు విక్రయాలకు అనుమతివ్వాలి

- నాగేశ్వరరావు, రైతుసంఘ నాయకుడు

ఉన్నతాధికారులకు తెలియజేశాం

డీజిల్ లూజు విక్రయాలపై రైతుల అభ్యర్థనను ఉన్నతాధికారులకు, ఎన్నికల అధికారులకు తెలియజేశాం. వారు పై అధికారులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. వారి ఆదేశాల కోసం చూస్తున్నాం.

- ఎస్సై నాగరాజు

స్ట్రాంగ్‌రూంకు 2 కిలోమీటర్లు రెడ్‌జోన్



- నిమ్రాలో 400 మందితో బందోబస్తు.. రెండు దశల్లో గస్తీ
- అల్లర్లలో ఉన్న వారిపై రౌడీషీట్.. 109 మంది బైండోవర్
- పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ

విజయవాడ, మే 20(ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూంలకు రెండు కిలోమీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా విధించామని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి డ్రోన్లు ఎగరవేయకూడదని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మీడియాతో సోమవారం ఆయన మాట్లాడారు. నిమ్రా కళాశాలలో ఏర్పాటు చేసిన 29 స్ట్రాంగ్ రూంల వద్ద 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రెండు దశల్లో బందోబస్తు ఉంటుందన్నారు. రెండు పారామిలటరీ కంపెనీలకు చెందిన బలగాలు, ఏపీఎస్పీ సిబ్బంది ఇక్కడ బందోబస్తును నిర్వహిస్తున్నారన్నారు. వారితో సివిల్ పోలీసులు ఉంటారన్నారు. స్ట్రాంగ్ రూంలను పరిశీలించడానికి కలెక్టర్ జారీచేసిన పాసులున్న అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద ఉన్న భద్రతను ఇక్కడ నుంచి సీసీ కెమెరాల్లో వీక్షించవచ్చన్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందిని గుర్తించడానికి 100 ఫేషియల్ రిక్గ్నిజేషన్ కెమెరాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 144, 30 సెక్షన్లు అమల్లో ఉన్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో మొబైల్ చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న బందోబస్తుకు అదనంగా మరో రెండు కంపెనీలను బందోబస్తుకు పంపుతున్నారన్నారు. ఎన్నికల రోజున గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అల్లర్లలో అన్ని కేసుల్లోనూ నిందితులను అరెస్టు చేశామన్నారు. ఇందులో కొంతమందిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. లెక్కింపు సందర్భంగా అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని గుర్తించిన 109 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని తెలిపారు. కొంతమందిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, మరి కొంతమందిని నగర బహిష్కరణ చేస్తామని తెలిపారు. మైలవరంలో నిబంధనలను ఉల్లంఘించి విడిగా పెట్రోలు పోస్తున్న ఓ పెట్రోలుబంకుపై కేసు నమోదు చేశామని, ఈ బంక్‌పై చర్యలకు సంబంధిత శాఖకు సిఫారసు చేశామని తెలిపారు. ఎక్కువ మొత్తంలో బాణసంచా సామగ్రిని విక్రయించొద్దని దుకాణాలకు, తయారీదారులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో పారామిలటరీ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

తప్పుడు సమాచారం ట్రోల్ చేస్తే చర్యలు

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినా, దాన్ని ట్రోల్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న పోస్టింగ్‌లపై నిఘా పెట్టడానికి జిల్లాలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొదట్లో నలుగురితో ఈ బృందాన్ని ఏర్పాటు చేయగా, దాన్ని ఆరుకి పెంచామని తెలిపారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బృందం సామాజిక మాధ్యమాల పైనే పనిచేస్తోందన్నారు.

ఈవీఎంలకు మూడంచెల భద్రత



ఇబ్రహీంపట్నంలో స్ట్రాంగ్‌రూంలు పరిశీలించాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మే 20: ఈవీఎంలకు కేంద్ర, రాష్ట్ర సివిల్ పోలీసులతో ప్రభుత్వం మూడంచెల భద్రత కల్పించిందని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరిచిన ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలల్లో స్ట్రాంగ్ రూంలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈవీఎంల భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని భద్రతా సిబ్బందికి సూచించారు. స్ట్రాంగ్ రూంల తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. తనిఖీల అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కేంద్ర పోలీస్ బలగాల గార్డును, జిల్లా ఆర్మ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పరిశీలించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించొద్దని ఆదేశించారు.

వేగంగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాలి

- అందుకు తగిన ఏర్పాట్లు చేయండి
- అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సూచన



పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కౌంటింగ్ రోజున పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపును ముందస్తుగా చేయాలని, ఒక్కో టేబుల్‌కు 500 చొప్పున లెక్కించేలా, త్వరితగతిన ప్రక్రియ పూర్తయ్యేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై డెమోను సోమవారం ఆయన నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్లు చెల్లనివి ఉంటే ఏ కారణంతో వాటిని తిరస్కరిస్తున్నారో స్పష్టంగా తెలియజేసేందుకు అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు పి.పద్మావతి, డి.రాజు, వెంకట రమణ, ఎం.వాణి, బాలసుబ్రహ్మణ్యం, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రత్యేక టేబుళ్లపై పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

కృష్ణలంక: ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని, లెక్కింపు ప్రక్రియను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావుతో కలిసి సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్లు ఉంచిన స్ట్రాంగ్ రూంను అభ్యర్థుల ప్రతినిధులతో వారు పరిశీలించారు.



యథేచ్ఛగా..

మక్కపేట చెరువు నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

మట్టి తవ్వకాలు

- మక్కపేటలో నాలుగు రోజుల నుంచి ట్రాక్టర్లతో తోలకాలు
- అయినా పట్టించుకోని అధికారులు

వత్సవాయి, మే 20: మక్కపేట ఊర చెరువు నుంచి అనధికారికంగా నాలుగురోజుల నుంచి మట్టిని తరలిస్తున్నా అటువైపు అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. పగలు, రాత్రీ తేడా లేకుండా గ్రామ ప్రధాన రహదారిపై నుంచి వివిధ ప్రాంతాలకు మట్టి తరలింపు జరుగుతోంది. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి జేబులు నింపుకొంటున్నారు. ట్రక్కు మట్టి స్థానికంగా రూ.500, బయట ప్రాంతాలకు రూ.1,000కు అమ్ముకుంటున్నారు. ఎమ్మెల్యే మమ్మల్ని తోలుకోమన్నాడని, మండల అధికారులను చూసుకుంటున్నామని, తమను ఎవ్వరూ ఏం చేయలేరంటూ మట్టి మాఫియా విచ్చలవిడిగా మట్టి తరలిస్తోందని పలువురు గ్రామస్థులు అంటున్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో ఉద్యోగాలకు దరఖాస్తులు

వన్‌టౌన్, మే 20: ఎన్టీఆర్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో డాటా ఎంట్రీ ఆపరేటర్(ఎండీఎం) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ (టీఎంఎఫ్) పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి నోటీసు బోర్డులో ఉంచామని ఆయన తెలిపారు. వివరాలకు సూపరింటెండెంట్ జీవీ రమణ 8712367910లో సంప్రదించవచ్చునన్నారు. దరఖాస్తులను ఈనెల 24వతేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని ఆయన సూచించారు.



వేములపల్లి రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మైనింగ్ డీడీ ఇసుక రీచ్‌ల పరిశీలన

కంచికచర్ల, మే 20: నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌లలో భారీ యంత్రాలతో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో ఇసుక రీచ్‌లను ఎన్టీఆర్ జిల్లా ఉన్నతాధికారులు సోమవారం పరిశీలించారు. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, డీసీపీ శ్రీనివాస్, సెబ్ ఏఈఎస్ భార్గవ్ తదితరులు కంచికచర్ల మండలం వేములపల్లి, పెండ్యాల రీచ్‌లలో ఇసుక తవ్వకాలను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. నందిగామ ఏసీపీ రవికిరణ్, రూరల్ సీఐ చంద్ర శేఖర్, సెబ్ సీఐ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా ఉన్నారు.

భారీ యంత్రాలతో తవ్వలేదు: మైనింగ్ డీడీ సుబ్రహ్మణ్యం

ఇసుక రీచ్‌లలో భారీ యంత్రాలతో తవ్వకాలు జరగలేదని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నట్టుగా ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నారు. అనుమతులు లేకుండా లక్షల టన్నుల ఇసుక తవ్వి, తరలించినట్టుగా మీడియాలో వచ్చిన కథనాలపై ప్రస్తావించగా తెలియదు..ఏ ఫిర్యాదు రాలేదని తెలిపారు. తనకేమీ తెలియదన్నట్టుగా ముక్తసరిగా సమాధానం చెప్పారు. అడ్డగోలు తవ్వకాలపై ఆయన నోరు విప్పలేదు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

తూతూ మంత్రంగా పరిశీలన

జిల్లా అధికారుల ఇసుక రీచ్‌ల పరిశీలన తూతూమంత్రంగా జరిగింది. మునేటిపై ఉన్న పెండ్యాల, వేములపల్లి రీచ్‌లను మాత్రమే సందర్శించారు. ఈ రెండు రీచ్‌లలో లోపలికి వెళ్లలేదు. క్షుణంగా పరిశీలించలేదు. కృష్ణానదిపై ఉన్న గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికినపాడు రీచ్‌లవైపు చూడలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ రీచ్‌లలో భారీయంత్రాలతో రేయింబవళ్లు అడ్డగోలుగా తవ్వకాలు జరిగాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాతనే తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ రీచ్‌లను అధికారులు పరిశీలించలేదు. పెద్దగా తవ్వకాలు జరగని పెండ్యాల రీచ్‌ను మాత్రం పరిశీలించటం విశేషం.

అంబాపురం చెరువు స్థలం కబ్జా

- మెరక తోలి షెడ్డు నిర్మాణానికి సిద్ధం చేస్తున్న ఆక్రమణదారులు
- కబ్జాదారులకు అధికారుల వత్తాసు

విజయవాడ రూరల్, మే 20: మండలంలోని అంబాపురం గ్రామంలో చెరువు పోరంబోకు స్థలం కబ్జాదారుల పరమవుతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలన్న ఆలోచనతో అధికారం చేజారి పోయేలా ఉందని నిర్ధారణకు వచ్చిన వైసీపీ గ్రామ నేతలు కబ్జాలకు తెగబడుతున్నారు. కళ్ల ముందే చెరువుస్థలాన్ని కబ్జా చేస్తున్నా స్థానిక అధికారులు మాత్రం నోరుమెదపడం లేదు.

2 సెంట్లలో నిర్మాణానికి ఏర్పాట్లు

అంబాపురం గ్రామంలోని సర్వే నెం 18లో 5 సెంట్లలో చెరువు పోరంబోకు స్థలం ఉంది. హిందూ శ్మశానవాటిక వంతెన పక్కనే ఉన్న ఆ స్థలంపై వైసీపీ నేతల కన్ను పడింది. 2 సెంట్ల ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో సెంటు ధర రూ.8 లక్షలు ఉంది. రూ.16 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నా ఆక్రమణదారులకు వత్తాసుగా రాజకీయ ఒత్తిళ్లు రావడంతోనే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

షెడ్డు నిర్మాణం కోసం మెరక చేసి ఆక్రమించిన చెరువు పోరంబోకు స్థలం





విశ్వదాత అవార్డులందుకున్న విభిన్న రంగాల ప్రముఖులతో ఆర్డీవో డి.రాజు

స్ఫూర్తిప్రదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

- విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవంలో ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు

పామర్రు, మే 20: స్వాతంత్ర్య ఉద్యమానికి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు అందించిన సేవలు నిరుపమానమని, నేటి తరానికి ఆయన స్ఫూర్తిప్రదాత అని ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపరిచిన పలువురు ప్రముఖులకు ఎల్లకుర్రులో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఏటా అందించే విశ్వదాత అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని సోమవారం కేడీబీ ట్రస్టు కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీవో రాజు పాల్గొన్నారు. పత్రికల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి నాగేశ్వరరావు పంతులు అక్షరాయుధాలు అందించారని, నాటి నుంచి నేటి వరకు కాశీనాథుని వంశస్థుడైన నాగేశ్వరరావు ఎలకుర్రులో సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు, దివ్యాంగ చిన్నారులకు సేవలు అందిస్తున్నారని ఆర్డీవో పేర్కొన్నారు. మరో అతిథి బందరు మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ నిర్వహణ అధికారి సీబీకే ప్రసాద్ ఉపన్యాసించారు.

విశ్వదాత అవార్డులందుకున్నది వీరే..

ధర్మవరానికి చెందిన తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు, నందిగామకు చెందిన ప్రముఖకవి కథారచయిత లగడపాటి సంగయ్య, కైకలూరు ప్రాంతానికి చెందిన సైకతశిల్పి ఆకునూరి బాలాజీ వరప్రసాదరావు, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, ఆంధ్రపత్రిక కార్యనిర్వాహక సంపాదకురాలు వల్లభదాసు విజయలక్ష్మి, పెడనకు చెందిన సంఘసేవకుడు మట్టా రాధాకృష్ణమూర్తికి విశ్వదాత అవార్డులను అందజేశారు. వారందరినీ నిర్వాహకులు సత్కరించారు.

నెరెడ్కో కార్యవర్గం ఎన్నిక



విజయవాడ, మే 20(ఆంధ్రజ్యోతి): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) రాష్ట్ర శాఖ కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. చైర్మన్ జి.హరిబాబు, అధ్యక్షుడిగా గద్దె చక్రధర్‌ను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక ఉపాధ్యక్షులుగా పరుచూరి కిరణ్‌కుమార్, వై.దుర్గాప్రసాద్, తాళ్లూరి శివాజీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.సీతారామయ్య, కోశాధికారిగా చావా రమేష్‌బాబు, ఐదుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు కార్యదర్శులు, 21 మంది గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులతో కొత్త కార్యవర్గం కొలువుదీరింది.

ఎన్డీయే అధికారంలోకొస్తే

దేశ సమైక్యతకు భంగం



పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాసం చేస్తున్న బీవీ రాఘవులు

గవర్నర్‌పేట, మే 20: రానున్న పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే తిరిగి అధికారంలోకి వస్తే దేశ సమైక్యతకు తీవ్ర సవాళ్లు ఎదురౌతాయని సీపీఎం జాతీయ నేత బీవీ రాఘవులు అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'దేశ సమైక్యత-ఎదురౌతున్న సవాళ్లు' అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సభకు ఎంబీవీకె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి బీవీ రాఘవులు, పీ మధు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ... 'మతం పేరుతో దేశాన్ని విభజించాలని చూడటంతో పాటు రంగు ప్రాతిపదికన కూడా దేశాన్ని విభజించాలని బీజేపీ కుయుక్తులు పన్నింది. వీటి పట్ల దేశప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బీజేపీ అధికారంలోకి వచ్చినా, రాకున్నా జాతీయ సమైక్యతను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య వాదులంతా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీవీకె కార్యదర్శి పీ మురళీకృష్ణ, బాధ్యులు కే స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీ వెంకటేశ్వరరావుపై జగన్ ప్రభుత్వం పగబట్టిందని, ఆయనను సస్పెండ్ చేసి పలు రకాలుగా వేధింపులకు గురిచేసిందని అన్నారు. ఆయనపై సస్పెన్షన్ చెల్లదని, ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) ఆదేశాలిచ్చి 12 రోజులు దాటినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడ్డంకులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని తెలిపారు. అధికారుల మధ్య కూడా ఫ్యాక్షనిస్టుల మాదిరి కక్షలు సరికాదని, ఏబీవీ పట్ల కక్షపూరిత వైఖరిని విడనాడాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏబీ వెంకటేశ్వరరావు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేస్తున్నందున ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

మళ్లీ రైళ్ల రద్దు

- జూన్ 23 వరకు 8 పూర్తిగా..
- మరో 8 పాక్షికంగా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రైళ్ల రద్దుల పర్వం కొనసాగుతోంది. సోమవారం మరికొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిని మెయింటెనెన్స్ పేరుతో రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. బిట్రగుంట-విజయవాడ(07977), విజయవాడ- బిట్రగుంట(07978), బిట్రగుంట-చెన్నై సెంట్రల్(17237), చెన్నైసెంట్రల్-బిట్రగుంట(17238), గుంటూరు-రాయగడ(17243), రాయగడ -గుంటూరు (17244), కాకినాడ పోర్టు-విశాఖపట్నం(17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు(17268) రైళ్లను పూర్తిగా జూన్ 23వ తేదీ వరకు రద్దు చేశారు. రెండు రైళ్లను జూన్ 3, 16వ తేదీల వరకు రద్దు చేశారు. మరో 8 రైళ్లను జూన్ 23వ తేదీ వరకు పాక్షికంగా రద్దుచేశారు. మచిలీపట్నం-విజయవాడ (07896), విజయవాడ-మచిలీపట్నం(07769), నరసాపూర్-విజయవాడ(07863), విజయవాడ-మచిలీపట్నం(07866), మచిలీపట్నం-విజయవాడ(07770), విజయవాడ-భీమవరం జంక్షన్(07283), మచిలీపట్నం-విజయవాడ(07870), విజయవాడ-నరసాపురం(07861) ఉన్నాయి. మరో 11 రైళ్లను దారి మళ్లించారు.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం పరీక్షలు నిర్వహించే వివిధ విభాగాల అధికారులతో ఆయన గూగుల్ మీట్ నిర్వహించారు. ఈనెల 24వతేదీ నుంచి జూన్ 3వతేదీ వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. 395 పాఠశాలలకు చెందిన 6,046 మంది విద్యార్థులు 24 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.45గంటలకు ముగుస్తుందన్నారు. ప్రశ్నాపత్రాల భద్రత, జవాబు పత్రాల చేరవేతలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షలు అవకతవకలు లేకుండా నిర్వహించాలని, పోలీస్ బందోబస్తు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాల పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సార్వత్రిక విద్యాపీఠం జూన్ 1వతేదీనుంచి 8వతేదీ వరకు నిర్వహించే ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీఈవో తాహెరా సుల్తానా, ఎస్‌బీ సీఐ వెంకటరమణ పాల్గొన్నారు.

మరింత శీఘ్రంగా దుర్గమ్మ దర్శనమయ్యేలా చూడండి

- దుర్గగుడి అధికారులతో ఈవో రామారావు

వన్‌టౌన్, మే 20: "ఇంద్రకీలాద్రిపై రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోంది. భక్తులకు అమ్మవారి దర్శనం మరింత వేగంగా అయ్యేలా చూడాలి. అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి. మరింత మెరుగైన పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలి. దుర్గగుడి అభివృద్ధికి అధికారులు సమష్టిగా పనిచేయాలి." అని వివిధ విభాగాల అధికారులకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో రామారావు సూచించారు. దేవస్థానంలో భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనపై సోమవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ మేరకు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపైన, తదుపరి చేయాల్సిన పనులపైన సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇంద్రకీలాద్రిపైన, దుర్గగుడి పరిసరాల ప్రాంతాల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈఈ లింగం రమాదేవి, ఏఈవోలు, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. దుర్గగుడిలో నిర్వహిస్తున్న అన్నవితరణ కార్యక్రమానికి తెలంగాణలోని ఖమ్మం పట్టణానికి చెందిన అల్లం దుర్గారావు, కుటుంబసభ్యులు రూ.1,11,111 విరాళాన్ని చెక్కురూపంలో అధికారులకు అందించారు.



విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా నెట్టెం జన్మదినోత్సవం

విద్యాధరపురం, మే 20: టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ జన్మదినోత్సవాన్ని విజయవాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాలుగో డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన కేకును వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడు సోలంకి రాజు జైన్ కట్ చేసి రఘురామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హుందా రాజకీయాలకు రఘురామ్ పెట్టింది పేరని, జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారని అన్నారు. మరుపిళ్ల తిరుమలేష్, బొల్లా వెంకటేశ్వరరావుగౌడ్, పామర్తి కిషోర్‌బాబు, కాకు మల్లికార్జునయాదవ్, కోడూరు ఆంజనేయవాసు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

కూటమికి వస్తున్న ప్రజాదరణతో ఓర్వలేకే దాడులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 20 : శాంతియుత పాలనతో పాటు అభివృద్ధి చేయగల సత్తా కలిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే భౌతికదాడులు చేస్తున్నారని జనసేన బందరు పార్లమెంటు నేత ఆకుల వెంకట నాంచారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగన్నగూడెంలో ఆళ్ల గోపాలకృష్ణను సోమవారం జనసేన నాయకులు పరామర్శించారు. శాంతియుతంగా ఉండే గన్నవరం నియోజకవర్గంలో విపక్ష నేతలే లక్ష్యంగా దాడుల సంస్కృతి తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండ్రెడ్డి రవి, రత్నం నాగేశ్వరరావు, పొదిలి దుర్గారావు, సముద్రాల రామయ్య, గాజుల వీరాంజనేయులు, గుర్రాల నరసింహారావు, టీడీపీ నేతలు మొవ్వా వేణుగోపాల్, కసుకుర్తి అర్జునరావు, మందపాటి రాంబాబు, నెర్సు వెంకటేశ్వరరావు, కొలుసు రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్

ఉయ్యూరు, మే 20 : ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణతో పాటు సేవాభావం అలవరుచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్స్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ అన్నారు. విశ్వ శాంతి స్కూల్ ఆవరణలో ఎన్‌సీసీ కాకినాడ బెటాలియన్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 700 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు పదిరోజుల శిక్షణలో భాగంగా ప్రథమ చికిత్స, సీపీఆర్ పద్ధతులు, రక్తదాన ఆవశ్యకతపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. రక్తదాన ఆవశ్యకతపై రెడ్‌క్రాస్ అధికారులు శంకరనాథ్, అన్నమ్మ శిక్షణ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పూనుకోవాలని, రెడ్‌క్రాస్ యాప్ ద్వార రెడ్‌క్రాస్ వలంటీర్‌గా నమోదు చేసుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బాలాజీ సూచించారు. ఎన్‌సీసీ బెటాలియన్ అధికారి అజిత్‌సింగ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన శ్రీకాంత్‌పై రౌడీషీట్

పెనమలూరు, మే 20 : ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి రెండు కేసుల్లో నిందితుడిగా నమోదైన వణుకూరుకు చెందిన ఆరేపల్లి శ్రీకాంత్‌పై పెనమలూరు పోలీసులు రౌడీషీట్ తెరిచారు. గత నెలలో టీడీపీకి చెందిన అభ్యర్థిపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టడం, పోలింగ్ రోజున వణుకూరు గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై తన సహచరులతో కలిసి దౌర్జన్యానికి దిగి హత్యాయత్నం చేయబోవడం, అతనిపై గతంలో ఉన్న బైండోవర్ కేసులు, పేకాట కేసులు నమోదు దృష్ట్యా శ్రీకాంత్‌పై రౌడీషీట్ తెరిచామని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు.

అతిగా ప్రవర్తిస్తే చర్యలు..

స్టేషను పరిధిలో ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేస్తామని, ఎంతటి వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే 144, 30 పోలీసు యాక్టు ప్రకారం చర్యలు తీసుకొంటామని సీఐ రామారావు హెచ్చరించారు. ఎన్నికల రోజున అతిగా ప్రవర్తించిన వ్యక్తులను గుర్తించామని, సదరు వ్యక్తులపై రౌడీషీట్లు తెరిచేందుకు ఉన్నతాధికారుల అనుమతులు కోరామని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే వారిపై కూడా రౌడీషీట్లు తెరుస్తామని తెలిపారు.

కొల్లాకు లైఫ్ సేవియర్ అవార్డు



కొల్లాకు అవార్డు అందిస్తున్న న్యూ సిటీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు

పెనమలూరు, మే 20 : రక్తదాన కార్యక్రమాల ద్వారా తలసేమియా చిన్నారులను ఆదుకోవడంలో సహాయం, అత్యవసర సమయాల్లో రక్తం కావాలిసిన వారికి విద్యార్థులను ప్రోత్సహించి రక్తదానం చేయిస్తున్న వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్రకు విజయవాడ న్యూ సిటీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు లైఫ్ సేవియర్స్ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి వీవీ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహనుండాలి



గొల్లనపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న సదాలక్ష్మి

గన్నవరం, మే 20 : హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ మాతంగి సదాలక్ష్మి అన్నారు. మండలంలోని గొల్లనపల్లిలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థల సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం పురస్కరించుకుని ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సదాలక్ష్మి మాట్లాడుతూ, చెడు మార్గాలకు దూరంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని, లేకుంటే జీవితం అంధకారం అవుతుందని తెలిపారు. లింక్ వర్కర్ కరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, మే 20 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 11కేవీ టౌన్ ఫీడర్‌ను నిలుపుదల చేస్తున్నామని ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8నుంచి 11 గంటల వరకూ ఇస్లాంపేట, కొత్తపేట, పాతగన్నవరం, చెంచుల కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్

తోట్లవల్లూరు : మండలంలో నాలుగు సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, ఎన్నికల ఫలితాలు పూర్తయ్యే వరకు కొనసాగుతాయని సీఐ ఎం కిషోర్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, సమస్యాత్మక గ్రామాలైన గరికపర్రు, పెనమకూరు, గుర్విందపల్లి, రొయ్యూరు గ్రామాల్లోని పికెట్‌లను సందర్శించి ఆయా గ్రామాల ప్రజలకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని సీఐ కోరారు. సెక్షన్ 30, సెక్షన్ 144 అమల్లో ఉన్నాయని, ఎన్నికల ఫలితాల తరువాత ఎవ్వరు ఉద్రేకాలకు గురికావద్దని, రాజకీయ పార్టీలతో కలిసి గొడవలకు దిగవద్దని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దన్నారు. శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కిషోర్‌బాబు హెచ్చరించారు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

- వర్షం పడితే ఎక్కడి నీరు అక్కడే
- డ్రెయిన్లు పొంగి రోడ్డుపైకి వస్తున్న చెత్త, వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందులు పడుతున్న గన్నవరం వాసులు



గన్నవరం గాంధీబొమ్మ సెంటర్‌లో నిలిచిన నీరు

గన్నవరం, మే 20 : పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చినుకు పడితే ఎక్కడ నీరు అక్కడే నిలిచి పోతుంది. డ్రెయిన్లు పొంగి వర్షం నీరు రోడ్లపై ప్రవహించడంతో పాటు చెత్త వ్యర్థాలు రోడ్లపై పేరుకుపోతున్నాయి. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలం ఇంకెంత అధ్వానంగా ఉంటుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలక్ష్యంతో గన్నవరం పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. సోమవారం కురిసిన వర్షానికి గన్నవరం ప్రధాన సెంటర్ అయిన గాంధీ బొమ్మ దగ్గర మోకాళ్ల లోతు నీళ్లు నిలిచాయి. నిత్యం వందలాది మంది చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చిపోతుంటారు. నీళ్లు నిలవటంతో వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. శ్రీనగర్ కాలనీ, బుద్ధవరం బస్టాప్, యాదవుల రామాలయం ఎదురు, మసీద్ దగ్గర, స్రవంతి హైస్కూల్ మలుపు వద్ద నీళ్లు నిలిచి అధ్వానంగా ఉంది. డ్రెయినేజీలో మురుగు అంతా రోడ్డు మీదకు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. శ్రీనగర్ కాలనీలోని రెండు బ్యాంకులు దగ్గరకి వెళ్లాలంటే మురుగునీళ్లలోనే వెళ్లాల్సి వస్తుంది. పంచాయితీ వారు రోడ్లపై నీటి నిల్వలు లేకుండా కనీస చర్యలు కూడా చేపట్టడం లేదు. పంచాయితీ కార్యదర్శి పాలకవర్గం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అక్రమ నీటి కనెక్షన్‌లపై పెట్టే శ్రద్ధ పట్టణ సమస్యల మీద చూపటం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రపరిచి వర్షం కురిసినప్పుడు రోడ్లపైకి నీరు రాకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎంజీనగర్‌లో పోలీసుల తనిఖీ

- అక్రమ మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు
- డాక్యుమెంట్లు లేని 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



బాపులపాడు ఎంజీనగర్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

హనుమాన్‌జంక్షన్, మే 20 : పోలింగ్ అనంతరం ఫలితాలు వెలువడే వరకు ఏవిధమైన అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లుకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తప్పవని హనుమాన్‌జంక్షన్ సీఐ ఏఎస్ నరసింహమూర్తి ప్రజలను హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంజీనగర్‌లో సీఐ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్, వీరవల్లి పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఇంటిని ఆసాంతం తనిఖీ చేశారు. అందులో భాగంగా కాలనీకి చెందిన పి.ఈశ్వర రావు గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. కాలనీలో పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు కాలనీలో బయటి వ్యక్తులు ఉండరాదని, గుంపులు గుంపులుగా మాట్లాడకూడదని హెచ్చరించారు. ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడిన చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జనార్దన్, అర్జమ్మ, చిరంజీవి, ఇతర 54 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 20 : భర్త కాపురానికి తీసుకుని వెళ్లకపోగా పిల్లలను కూడా చూడనివ్వడంలేదనే మనస్తాపంతో వీరవల్లికి చెందిన మార్గాని పూజిత (30) ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. 2013లో ఆమెకు ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం సింగరాయపాలెంనకు చెందిన శ్రీనివాసరావుతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలం సంసారం సాఫీగా సాగింది. తరువాత కట్నంగా ఇచ్చిన భూమిని తనపేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని భార్యతో తరచూ ఘర్షణకు దిగడంతో కాపురంలో కలహాలు మొదలయ్యాయి. 2017లో పిల్లలను తన దగ్గర ఉంచుకొని భార్యను పుట్టింటికి పంపించేశాడు. ఈ మధ్య విడాకులకు నోటీసు పంపించాడు. ఈ నేపథ్యంలో తనను కాపురానికి తీసుకెళ్లాలని లేదా తన పిల్లలను తనదగ్గరకు పంపాలని ఆమె ఫోన్‌లో కోరింది. భర్త స్పందించకపోవడంతో మనస్తాపం చెందిన పూజిత ఆదివారం మధ్యాహ్నం పురుగులమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం పూజిత మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు.

నచ్చిన బైక్ కొనలేదని యువకుడు..

గన్నవరం: తల్లిదండ్రులు నచ్చిన బైక్ కొనిపెట్టలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సూరంపల్లిలో జరిగింది.

ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపూడి నితిన్(18) తనకు పెద్ద బైక్ కావాలని తండ్రికి చెప్పాడు. తండ్రి షోరూమ్‌కు తీసుకువెళ్లగా ఆ బైక్ స్పోర్ట్స్ బైక్ అని తెలిసింది. వెంటనే ఈ పెద్ద బైక్ ఇప్పుడు వద్దని, తరువాత కొనిపెడతానని సున్నితంగా చెప్పాడు. దీంతో ఇద్దరు ఇంటికి వచ్చారు. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్న నితిన్ ఈ నెల 18న ఎలుకల మందు పేస్ట్ తిన్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి





గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు.. వీరవల్లిలో క్యారమ్ బోర్డు అందజేస్తున్న స్వర్ణలత

గన్నవరం, మే 20 : గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలని ఇన్‌చార్జి డి.బాబూరావు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాల యంలో వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులతో కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో దోహ దపడుతుంద న్నారు. పోటీ పుస్తకాలతో పాటు నాటి చరిత్రలు తెలిపే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను విద్యార్థులతో చదివించటం స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, మహాభారతం, రామాయణం, నీతి కథలు, పిల్లల పుస్తకాలను చదివించటం ద్వారా, పిల్లల్లో చదివే అలవాటును ప్రోత్సహించటం ఆసక్తిని పెంచటమే సమ్మర్ క్యాంపు ముఖ్య ఉద్దేశమన్నారు. పి.దుర్గా లక్ష్మీ, రామచంద్రరాజు, కంభంపాటి దర్మారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు



ఉంగుటూరు గ్రంథాలయంలో..

ఉంగుటూరు : విద్యార్థుల మేధోసంపత్తిని పెంచి, జ్ఞానాన్ని సముపార్జిం చడంలో గ్రంథాల యాలు ఎంతగానో దోహదపడతాయని, ప్రతి విద్యార్థి తరచుగా గ్రంథాలయాలను సందర్శించడం అలవాటుగా చేసుకోవాలని ఆత్కూరు, మానికొండ, తేలప్రోలు, ఉంగుటూరు గ్రంథాలయాధికారులు బీవీ కృష్ణారావు, ఎల్.హరికృష్ణ, బి.శ్రీనివాసరావు, యు.చంద్రశేఖరరావు అన్నారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాల్లో భాగంగా మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో సోమవారం విద్యార్థులకు పుస్తకపఠనం, శ్లోకాలు వల్లెవేయటం, పాటలు పాడటం, కలర్‌పేపరుతో వివిధ రకాల పూల ఆకృతులు, బొమ్మలు తయారు చేయటం, వంటి పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని గ్రంథాలయాధికారి స్వర్ణలత తెలిపారు. వీరవల్లి శాఖ గ్రంథాలయంలో సోమవారం విదార్థులకు క్యారమ్స్, చెస్ లాంటి ఇండోర్‌గేమ్స్‌లో పోటీలు నిర్వహించారు. మంచి పుస్తకమే మంచి స్నేహితుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోడెబోయిన బాబి, డాక్టర్ రామకృష్ణ, త్రిపురాంబ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్స్ పోటీలు

ఉయ్యూరు : శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించి కథలు చెప్పించారు. జనరల్ నాలెడ్జి, నైతిక విలువలపై ఎన్ సాంబ శివరావు విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి రమణి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో..

హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్‌కు రోటరీ అవార్డు

గన్నవరం, మే 20 : విజయవాడ స్టార్ హోటల్‌లో రోటరీ విజయవాడ మిడ్టౌన్ పలు సేవా కార్యక్రమాల్లో, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులకు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డులు గవర్నర్ సుబ్బారావు రావూరి సోమవారం అందజేశారు. మండలంలోని దావాజీగూడెంకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ కృష్ణాజిల్లా దివ్యాంగుల పరిరక్షణ అడ్వైజరీ కమిటీ బోర్డు సభ్యుడు సంకాబత్తుల వెంకట్ చేస్తున్న సేవలను గుర్తించి రోటరీ ఎక్సెలెంట్ ఆఫ్ సర్వీస్ ఇంటర్నేషనల్ అవార్డును అందజేసినట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సంకాబత్తుల వెంకట్



వాసవీమాతకు లక్షమల్లెల అర్చన

పెడన, మే 20 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలలో భాగంగా వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవికి లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. వాసవీ మహిళా మండలి సభ్యులు లలిత పారాయణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కన్యకా పరమేశ్వరీ దేవిని అధిరోహింప చేసి మేళ పుర వీధులలో ఊరేగించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో జరిగిన పూజల్లో రాజా, రాధాకృష్ణగుప్తా, మంజులత, పద్మ, జవ్వాజి నాగరాజు, కొమ్మూరి శారద, విజయదుర్గ, తమ్మన లక్ష్మీతాయారు, మామిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



తేలప్రోలు గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

ఎన్నికల ఘర్షణలపై పోలీసుల ఆరా

ఫలితాల రోజు గొడవ పడితే కఠిన చర్యలు: డీఎస్పీ జయసూర్య

ఉంగుటూరు, మే 20 : సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజు గొడవలు, ఘర్షణలు పడే వారిపై కఠిన చర్యలుంటాయని, కేసులు నమోదు చేసి కోర్టుకు పంపటం జరుగుతుందని గన్నవరం డీఎస్పీ ఆర్.జీ.జయసూర్య హెచ్చరించారు. మండలంలో సమస్యాత్మక గ్రామమైన తేలప్రోలును సోమవారం హనుమాన్‌జంక్షన్ సీఐ ఏ.నవీన్‌నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్సై ఏ.పైడిబాబుతో కలిసి ఆయన సందర్శించారు. ఎన్నికల పోలింగ్ రోజు స్థానిక జడ్పీహైస్కూల్ వద్ద టీడీపీ వర్సెస్ వైసీపీ వర్గాల మధ్య ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులైన యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని వంశీ సమక్షంలో జరిగిన గొడవలో ఎవరి ప్రమేయం ఎంత వుంది అనే విషయమై స్థానికులను ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, పోలింగ్‌రోజు ఘర్షణలో పాల్గొన్న వారందరిపై కేసు నమోదు చేశామని, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో ప్రజలందరూ ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకులోనై ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. క్షణికావేశంతో పరస్పరం గొడవలు పడే వారిని ఉపేక్షించేది లేదని వారిపై తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఆ తర్వాత కోర్టుల చుట్టూ తిరగలేక తీవ్రఇబ్బందులు పడతారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తేలప్రోలు గ్రామప్రజలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కలాణోత్సవం రేపు

ఉంగుటూరు, మే 20 : మండల పరిధిలోని లంకపల్లి అగ్రహారంలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 22వ తేదీ బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. కుమ్మమూరు వాస్తవ్యులు పరాశరం రామకృష్ణమాచార్య పాకయాజి ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా స్వామివార్లకు కల్యాణం జరపనున్నట్టు పేర్కొన్నారు.

కృష్ణా

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం



మోపిదేవి, మే 20 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతలు విరాళాన్ని అందజేశారు. గూడూరు గ్రామానికి చెందిన అన్నం శ్రీకృష్ణ తేజ - తేజస్వి పేర్ల మీద తల్లిదండ్రులు అన్నం హరి రామకృష్ణ - అరవింద, కుటుంబసభ్యులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఈవో ఎన్.సూర్యచక్రధరరావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.



కొనకళ్ల నారాయణరావును పరామర్శిస్తున్న వేదవ్యాస్, విక్కుర్తి శ్రీనివాస్

కొనకళ్లకు వేదవ్యాస్, విక్కుర్తి పరామర్శ

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ, మే 20 : గుండెపోటుకు గురై విజయవాడ రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మచిలీపట్నం స్వగృహానికి వచ్చిన మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును సోమవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్‌తో పాటు టీడీపీ నాయకులు ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, మోటమర్రి బాబా ప్రసాద్, బత్తిన దాసు, మరకాని పరబ్రహ్మం, పి.వి. ఫణికుమార్, లంకే నారాయణప్రసాద్, లంకే హరికృష్ణ, లంకే శేషగిరి, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, జనసేన నాయకులు బండి రామకృష్ణ, చిలంకుర్తి పృథ్వీప్రసన్న, కొరియర్ శ్రీను, గడ్డం రాజు తదితరులు పరామర్శించారు. కాగా, జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు విజయవాడలోని ఆసుపత్రిలో పరామర్శించారు. విక్కుర్తి రాంబాబు, బర్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాసవీమాతకు లక్ష మల్లెలార్చన

పెడన, మే 20 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలలో భాగంగా వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవికి లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. వాసవీ మహిళా మండలి సభ్యులు లలిత పారాయణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కన్యకా పరమేశ్వరీ దేవిని అధిరోహింప చేసి మేళ పురవీధులలో ఊరేగించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో జరిగిన పూజల్లో రాజా, రాధాకృష్ణగుప్తా, మంజులత, పద్మ, జవ్వాజి నాగరాజు, కొమ్మూరి శారద, విజయదుర్గ, తమ్మన లక్ష్మీతాయారు, మామిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కుమార్‌రాజా స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



పమిడిముక్కల, మే 20 : మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయంలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ను పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజ సోమవారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు భద్రతకు తీసుకున్న చర్యలు, భద్రతకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు.



ఎంపీడీవో, ఎంపీపీలకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

కాల్వలు, డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టాలి

నాగాయలంక, మే 20 : వర్షాకాలం రాకముందే పంట కాల్వలు, డ్రెయినేజీలకు మరమ్మతులు చేసి రైతుల ప్రయోజనాలు కాపాడాలని భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, పెదపాలెం సర్పంచి దున్నా రాజేష్, నాగాయలంక -2 ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్ సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భోగాది రామవారాణి అధ్యక్షతన జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీవో జె.కే.సీతారామ కుమార్ ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. నీటిపారుదల శాఖపై ఏఈ రవితేజ వివరణ ఇస్తుండగా, కాల్వలు, డ్రెయినేజీలకు ఎప్పుడు మరమ్మతులు చేస్తారని సర్పంచి ఉదయభాస్కర్ తదితరులు ప్రశ్నించారు. ప్రతిపాదనలు తయారు చేసి, పంపించామని,మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో, ఎంపీపీకి ప్రజాప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. నాగాయలంక నుంచి నరసాపురానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని, నాగాయలంక నుంచి మచిలీపట్నం, విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బదులు పల్లె వెలుగు బస్సులను నడపాలని లంకే శ్రీనివాస ప్రసాద్, దున్నా రాజేష్ కోరారు. సమావేశం మొక్కుబడిగా ముగిసింది.

వైభవంగా పరమేశ్వరీ గ్రామోత్సవం




కోడూరు : వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ దివిసీమ ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్య క్షులు అన్నం శ్రీనివాస్, వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బూరగడ్డ హరినాథ్ బాబు, వర్తక సంఘం అధ్యక్షుడు మద్దాలి ప్రసాద్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కోడూరు సత్యనారాయణ, సహారా బుజ్జి, ఆర్గనైజర్ అన్నం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ప్రజలు తరిమికొట్టారు : టీడీపీ

మచిలీపట్నం టౌన్, మే 20 : ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో భూములను కాజేయడానికి కుట్ర పన్నిన సీఎం జగన్‌రెడ్డికి గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటు వజ్రాయుధంతో బుద్ధి చెప్పారని టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. శిడింబి అగ్రహారంలో సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లను, సచివాలయాలను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ నిధులను కాజేసి గ్రామ పంచాయతీలను జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు జగన్‌రెడ్డిని మోసగాడని గుర్తించి తరిమికొడుతున్నారన్నారు. ఎన్నికల ఫలితాల్లో కూటమికి 125 నుంచి 150 స్థానాలు వస్తాయన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరతాయన్నారు. టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, మెండు భానుమూర్తి, సిరివెళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో పార్వతి ప్రతిభ



అవనిగడ్డ రూరల్, మే 20 : అవనిగడ్డ శివారు వలందపాలెం గ్రామానికి చెందిన అద్దంకి పార్వతి భగవద్గీత పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి నుంచి ప్రథమ బహుమతి అందుకున్నారు. భగవద్గీతలోని 700 శ్లోకాలను అవపోసన చేయడం అభినందనీయని గణపతి సచ్చిదానంద పేర్కొన్నారు. అద్దంకి పార్వతీకి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు.



పెట్రోల్ బంకు యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న చల్లపల్లి తహసీల్దార్ సుమతి, ఘంటసాల తహసీల్దార్ విజయలక్ష్మి



పెనమకూరులో ప్రజలకు సూచనలిస్తున్న సీఐ కిషోర్‌బాబు

అల్లర్లకు ఊతమిస్తే కఠిన చర్యలు

పెట్రోల్, డీజిల్ లూజు విక్రయించరాదు : తహసీల్దార్లు, సీఐల హెచ్చరిక

చల్లపల్లి, మే 20 : అల్లర్లకు ఊతమిచ్చేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.సుమతి స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పెట్రోల్ బంకు యజమానులు, హోల్‌సేల్ టపాసుల అమ్మకందారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ విడిగా బాటిల్స్, టిన్నుల ద్వారా అమ్మకాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పటిష్ఠంగా అమ లు చేయాలనీ, కౌంటింగ్ పూర్తయిన తర్వాత గ్రా మాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్ మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ విడి అమ్మకాలను ఆపివేయటంతోపాటు టపాసుల అమ్మకాలను సైతం నిలిపివేయాలన్నారు. గ్రామాలలో అనుమానాస్పదంగా సం చరించేవారు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా అందరూ సంయ మనంతో వ్యవహరించాలన్నారు. ఇన్‌చార్జి ఆర్‌ఐ ఘంటసాల కృష్ణ మోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు. **ఘంటసాల :** జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు పెట్రోల్ బంకు యజమానులు లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలు చేయరాదని తహసీల్దార్ విజయలక్ష్మి ఆదేశించారు. సోమవారం పెట్రోల్ బంకు యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. పెట్రోలు, డీజిల్ విడిగా బాటిల్స్, టి న్నుల ద్వారా అమ్మకాలను తక్షణమే ఆపివేయాలని కోరారు. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై ప్రతాప్ రెడ్డి, డిటి చిట్టిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి



చల్లపల్లి : పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలు చేయవద్దని చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పెట్రోలు బంకు యజమానులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలని స్పష్టంచేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటటామని హెచ్చరించారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న మొవ్వ తహసీల్దార్ వెంకటలక్ష్మి

కూచిపూడి : పెట్రోల్ బంకుల్లో లూజ్ విక్రయాలు నిలిపివేయాలంటూ జిల్లా ఎన్నికల అధికారి డి.కె.బాలాజీ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం మొవ్వ తహసీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మండలంలోని పలు పెట్రోల్ బంకులను ఆకస్మిక తనిఖీలు చేశారు. జూన్ 6వ తేదీ వరకు పెట్రోల్ బంకులలో లూజ్‌గా పెట్రోలు, డీజిల్ అమ్మరాదని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయటానికి సహకరించాలని తహసీల్దార్ పెట్రోల్ బంకు యజమానులకు తెలిపారు. మొవ్వలోని రెండు, కూచిపూడి, కోసూరు, నిడుమోలులోని పెట్రోల్ బంకులు తనిఖీ నిర్వహించి సిబ్బందికి, లైసెన్స్ దారులకు సూచనలు అందజేశారు. సీసాలలో గానీ, బాటిల్స్‌లో గానీ, క్యానులలోగానీ విడిగా పోయరాదని తెలిపారు. ఆర్‌ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు ఎం.ఖాసిం, జి.రాజేంద్ర ఫణి, కెపి.నెహ్రూ, ఎం.నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్

తోట్లవల్లూరు : మండలంలో నాలుగు సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని, ఎన్నికల ఫలితాలు పూర్తయ్యే వరకు కొనసాగుతాయని సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలైన గరికపర్రు, పెనమకూరు, గుర్విందపల్లి, రొయ్యూరు గ్రామాల్లోని పికెట్‌లను సందర్శించి ఆయా గ్రామాల ప్రజలకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని సీఐ కోరారు. సెక్షన్ 30, సెక్షన్ 144 అమల్లో ఉన్నాయని, ఎన్నికల ఫలితాల తరువాత ఎవ్వరు ఉద్రేకాలకు గురికావద్దని, రాజకీయ పార్టీలతో కలిసి గొడవలకు దిగవద్దని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దన్నారు. శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కిషోర్‌బాబు హెచ్చరించారు.

రెచ్చగొట్టే పోస్టులు సహించం



గుడివాడ రూరల్ : ఉద్దేశ్యపూర్వకంగా సోషల్ మీడియాలో ట్రోల్స్, మీమ్స్ పెట్టి ప్రత్యర్థులను రెచ్చగొట్టే విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మీనరసింహమూర్తి తెలిపారు. స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేకమైన చర్య లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ముగ్గురికి మించి గుమికూడి ఉండరాదన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు రాజకీయ నాయకులు, కార్యకర్తలు ప్రత్యర్థుల ఇళ్ల ముందు, కార్యాలయాల ముందు బాణాసంచా కాల్చరాదని తెలిపారు. సివిల్ తగాదాలు ఆసరాగా చేసుకుని గొడవలకు దిగితే ఇరువురిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడివాడలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఆంధ్ర జాతీయ బీఈడీ కళాశాల 2001-2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఆంధ్ర జాతీయ బీఈడీ కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మచిలీపట్నం టౌన్, మే 20 : ఆంధ్ర జాతీయ బీఈడీ కళాశాల 2001-2002 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా విశ్రాంత అధ్యాపకులు డి.ఎస్.ఎన్. శాస్త్రి విచ్చేసి సందేశమిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య స్థాపించిన ఆంధ్రజాతీయ పరిషత్‌కు ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఆంధ్ర జాతీయ బీఈడీ కళాశాలలో చదువుకున్న పలువురు విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారన్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఎన్.శాస్త్రిని ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు బెనర్జీ, సుధాకర్, శ్రీనివాసులు మాట్లాడారు. తమ అనుభవాలను పూర్వ విద్యార్థులు నెమరువేసుకున్నారు.

గ్యాస్ లీకేజీ - హోటల్ దగ్ధం

కూచిపూడి : గ్యాస్ లీకేజీ కారణంగా మొవ్వ కాలేజ్ రోడ్డులోని ఓ హోటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఫ్రిజ్‌లు, వంట సామాగ్రి, ఫర్నీచర్, పచారి సరుకులు మొత్తం కాలి బూడిదయ్యాయి. రూ.1.50 లక్షల నష్టం వాటిల్లింది. హోటల్ యజమాని సుధాకర్ ఇచ్చిన సమాచారం మేరకు ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు నేతృత్వంలోని సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఆలయ ధ్వజస్తంభానికి పూజలు



అవనిగడ్డ రూరల్ : పులిగడ్డలో కనకదుర్గాదేవి ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవానికి భద్రాచలం నుంచి సోమవారం ధ్వజస్తంభం తీసుకొచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి స్తంభానికి విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మండలి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ బ్యాంక్ అధికారి బావరాజు ఫణికుమార్ రూ.లక్ష తన తల్లిదండ్రులు బావరాజు కృష్ణమూర్తి - ఆదిలక్ష్మి కామేశ్వరి పేరిట అందజేశారన్నారు.

నాగాయలంకలో సెక్షన్ 30 అమలు

నాగాయలంక : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగాయలంక టౌన్, డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమల్లో ఉందని ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం ప్రజలు, రాజకీయ పార్టీలు, ఇతర ఏ సంఘాలు ముందస్తు అనుమతి లేనిదే ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదన్నారు.. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం - రూ.లక్షన్నర ఆస్తి నష్టం

వృద్ధులకు దుస్తుల పంపిణీ

గుడివాడ : దాసరి, గ్లోరీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. బేతవోలు పెద్దపేటలోని మద్దాల ఇశ్రాయేలు మెమోరియల్‌లో దాసరి, గ్లోరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దాసరి గ్లోరీ ఆనంద్ తల్లిదండ్రులు దాసరి క్రీస్తుదాసు, అవమ్మ జ్ఞాపకార్థం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. చోరగుడి ఇస్రాయేలు, పాస్టర్లు వెంకటరమణ, విలియం, ఎం.అనిల్ కుమార్, హాస్నోక్ విచ్చేశారు. తియోఫ్లస్ రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పమిడిముక్కల : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మంటాడ, గురజాడ, తాడంకి, రెడ్డిపాలెం, ముత్రాసిగూడెం, ఫతేలంక, గౌడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, పటమట లంకపల్లి, అప్పారావుపేట, ఎట్టివాని గూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జ్యూటివ్ ఇంజనీర్ ఎం. భాస్కరరావు తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం, గూడూరు మండలాల్లో రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేశారు. జీలుగ, జనుము కిలో రూ. 44కు సబ్సిడీ ధరతో ఎకరాకు 10 కేజీల చొప్పున పంపిణీ చేశారు. పిల్లిపెసర కిలో రూ.67కు పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకులు ప్రభాకర్, కుమార్, పోతన రాధాకృష్ణ, మాగంటి శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు కుమార్‌రాజా పరామర్శ

చోరగుడి(పమిడిముక్కల) : పిచ్చుకలపాడులో టీడీపీ కార్యకర్త గొరికపూడి నాగరాజు తండ్రి ఆంజనేయులు సోమవారం మృతి చెందగా ఆయన మృతదేహాన్ని పామర్రు నియో జకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. అంతిమ యాత్రలో పాల్గొని శవపేటిక మోశారు. సుబ్రమణ్యం, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బుడ్డియ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగానమ్మ జాతర

గుడ్లవల్లేరు : కూరాడలో గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం కొర్లబండిలో అమ్మవార్ని ఊరి పొలిమేర్లకు సాగనంపారు. గంగానమ్మ అమ్మవారి అవతారంలో ఉన్న వ్యక్తిని కొర్లబండిలో కూర్చోబెట్టి గ్రామమోత్సవం నిర్వహించారు. చివరిరోజు ఐదువేల మందికి అన్న సమారాధన నిర్వహించారు.

పోలాశమ్మ, అంకాలమ్మకు నైవేద్యాలు

అవనిగడ్డ రూరల్, మే 20 : పులిగడ్డలోపోలాశమ్మ అమ్మవారికి భక్తులు చల్ది నైవేద్యాలు సమర్పించారు. మండలి వెంకటేశ్వరరావు, మండలి వెంకట శేషగిరిరావు మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పులిగడ్డలో అంకాలమ్మ జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

టంగుటూరికి టీడీపీ నివాళి

మచిలీపట్నం టౌన్, మే 20 : వర్ధంతిని పురస్కరించుకుని టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. మోటమర్రి బాబా ప్రసాద్, గుమ్మడి విద్యాసాగర్, పి.వి. ఫణికుమార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, బొడ్డు నాగరాజు, సూరిశెట్టి హరికృష్ణ, సుబ్బారావు, ప్రసాద్, ఫణిరాజు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** టంగుటూరి చిత్రపటానికి కొల్లూరి వెంకటేశ్వరరావు, రఘునాథ్, ఏడుకొండలు, రామ్మోహనరావు, చందన నరసింహారావు, యలవర్తి చిన్నా, గోపి, సోమిరెడ్డి, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు శ్రీనివాసరావు, గరికపాటి హరి, మాధవరావు, భోగిరెడ్డి బుజ్జి, రాంబాబు, అంకినీడు, కమ్మిలి రమేష్ తదితరులు నివాళులర్పించారు.